కమ్మేసిన మబ్బులు.. అన్నదాతల్లో గుబులు

- రెండు రోజుల్లో 2 వేల ఎకరాల్లో వరి కోతలు
- ఒక్క రోజులో 2,200 మె.టన్నుల ధాన్యం తరలింపు
- ఆఫ్‌లైన్‌లో సేకరణకు ప్రభుత్వం అనుమతి
- అన్నదాతలకు అండగా అధికారులు



అటు నింగి నిండా మబ్బులు.. ఇటు అన్నవరప్పాడులో హడావుడిగా ధాన్యం ఒబ్బిడి



తుపాను ముంచుకొస్తోంది.. ధాన్యం పట్టుబడి మొదలు పెట్టాలని పెరవలిలో రైతును హెచ్చరిస్తున్న ఏవో మేరీ కిరణ్

పెరవలి: బంగాళాఖాతంలో ఏర్పడిన మిచాంగ్ తుపాన్ హెచ్చరికలతో రైతులు పంటలను ఒబ్బిడి చేసుకునే పనిలో పడ్డారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో పెరవలి మండలంలో 8,500 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇప్పటి వరకూ సుమారు నాలుగు వేల ఎకరాల విస్తీర్ణంలోని వరి కోతలు పూర్తయ్యాయి. ఈ నాలుగు వేల ఎకరాల్లో కూడా దాదాపు రెండు వేల ఎకరాల్లోని పంట శుక్ర, శనివారాల్లో రైతులు యంత్రాల సాయంతో కోసి ఒబ్బిడి చేసిందే. తుపాను హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అన్ని విధాలా అండగా నిలిచింది. ముఖ్యంగా రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులు పొలాలకు వెళ్లి అన్నదాతలకు సాయంగా ఉంటున్నారు. రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యాన్ని గతంలో ఆన్‌లైన్ చేస్తే గాని లారీలకు లోడ్ చేయించి, మిల్లులకు తరలించే వారు కాదు. ఇప్పుడు ఆఫ్‌లైన్ ద్వారా ధాన్యాన్ని మిల్లులకు తరలించడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ప్రభుత్వం నిబంధనలను సరళతరం చేయడంతో వరి పంట కోత యంత్రాల అద్దె ఎక్కువగా ఉన్నప్పటికీ కూడా రైతులు చకచకా వరి పంటను కోయించి, వెంటవెంటనే నూర్పిడి చేయించి, ఆఫ్‌లైన్‌లో విక్రయిస్తున్నారు. ఈ విధంగా శనివారం ఒక్క రోజులోనే మండలం నుంచి 2,200 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లులకు తరలించారు. కాగా వరికోత యంత్రానికి గంటకు రూ.మూడు వేల చొప్పున అద్దె చెల్లించాల్సి వస్తోందని రైతులు తెలిపారు. ఎకరం విస్తీర్ణంలోని వరి పంటను కోయడానికి దాదాపు గంటన్నర సమయం పడుతుంది. దానికితోడు తుపాను ముప్పు పొంచి ఉండడంతో కూలీల రేట్లు కూడా పెరిగాయి. అయినప్పటికీ రైతులు వెరవకుండా కూలీలకు రోజుకు రూ.వెయ్యి వరకూ కూలి చెల్లించి వడివడిగా వ్యవసాయ పనులు పూర్తి చేస్తున్నారు. కాగా మండలంలో మరో 4,500 ఎకరాల్లోని వరి పంటను కోయవలసి ఉంది. మిచాంగ్ తుపాన్ ముప్పు అతి సమీపంలో ఉన్నందున, ప్రస్తుతం కోతలను వాయిదా వేసుకోవాలని మండల వ్యవసాయాధికారి మేరీకిరణ్ సూచించారు. ఒక వేళ కోతకు దిగితే పంట తడిసిపోయి, రైతులకు నష్టం వాటిల్లే ముప్పు ఉందని ఆమె హెచ్చరించారు.

క్లుప్తంగా

కొవ్వూరు విద్యార్థినికి ఎంబీబీఎస్‌లో గోల్డ్ మెడల్



విజయవాడలో ఎంబీబీఎస్‌లో గోల్డ్ మెడల్ అందుకుంటున్న భల్లం అపర్ణ

కొవ్వూరు: విజయవాడలోని పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ చదువుతున్న కొవ్వూరు పట్టణానికి చెందిన భల్లం సోమశేఖర్ కుమార్తె అపర్ణ గోల్డ్ మెడల్ సాధించారు. దీంతో శనివారం అపర్ణను పట్టణంలో ఆర్యవైశ్య సంఘ నాయకులు ఘనంగా సత్కరించారు.పట్టణ ఆర్యవైశ్య సంఘాధ్యక్షుడు మద్దుల సోమరాజు, మద్దుల సత్యనారాయణ, ఇతర నాయకులు అపర్ణను సన్మానించారు.

తాళ్లపూడిలో లక్ష పత్రి పూజ



తాళ్లపూడి శివాలయంలో లక్ష పత్రి పూజ నిర్వహిస్తున్న అర్చకులు

తాళ్లపూడి: కార్తిక మాసం సందర్భంగా తాళ్లపూడి గ్రామంలోనిఉమా మహేశ్వర స్వామి ఆలయం వద్ద ఆదివారం లక్ష పత్రి పూజ నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో తలపెట్టిన లక్ష పత్రి పూజను అర్చకులు జంధ్యాల గంగాధరశర్మ, అశ్వనీదత్ జరిపించారు. అనంతరం కార్తిక అన్న సమారాధన జరిగింది. సింహాద్రి జనార్దనరావు, సొలస విశ్వనాథం, చిట్టురి వెంకట్రాజు, కొండూరు రాజా, కునాల రాజా, వంకాయలు వెంకట బహదూర్, తాతా శేషు కుమార్ దంపతులు పూజల్లో పాల్గొన్నారు. మండలంలోని పలు గ్రామాల నుంచి ఆర్యవైశ్య కుటుంబాలు హాజరయ్యాయి.

హైదరాబాద్ వెళ్లి పింఛన్ అందజేత



హైదరాబాద్‌లో సువార్తకు పింఛను అందజేస్తున్న వలంటీర్ అరవింద్

దేవరపల్లి: మండలంలోని చిన్నాయగూడెంకు చెందిన సరిపల్లి సువార్త అనే పింఛనుదారు హైదరాబాద్‌లోని బంధువుల ఇంటికి వెళ్లింది. ఆమె అక్కడ అనారోగ్యానికి గురవడంతో గ్రామానికి చెందిన వలంటీర్ శనివారం హైదరాబాద్ వెళ్లి ఆదివారం సువార్తకు వృద్ధాప్య పింఛన్ సొమ్ము రూ.2750 అందజేశాడు. సొంత ఖర్చులతో హైదరాబాద్ వెళ్లి పింఛన్ అందజేసినట్టు అరవింద్ తెలిపారు.

రైళ్ల హాల్టులు పునరుద్ధరించాలంటూ ప్రచారం

కొవ్వూరు: స్థానిక రైల్వే స్టేషన్‌లో రద్దు చేసిన పలు రైళ్ల హాల్టులను పునరుద్ధరించాలని కోరుతూ రైల్వే స్టేషన్ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఆదివారం సంతలో కరపత్రాలు పంపిణీ చేశారు. కరోనా సమయంలో నిలిపివేసిన 36 రైళ్ల హాల్ట్‌లను పునరుద్ధరించాలని కోరుతూ తాము చేపట్టిన ఈ ఉద్యమానికి మద్దతుగా నిలివాలని వారు ప్రజలను కోరారు. ప్రజాస్వామ్య వాదులు, స్వచ్ఛంద సంస్థలు, మేధావులు, ఉద్యోగులు ఈ పోరాటంలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. రైళ్లకు హాల్టు ఇచ్చేంత వరకూ ఉద్యమాన్ని కొనసాగిస్తామని వారు ప్రకటించారు. రైల్వే హాల్ట్‌లను నిలిపివేయడం వల్ల ప్రయాణికులకు ఎదురవుతున్న ఇబ్బందులపై అవగాహన కల్పించారు. వైకే శ్రీనివాస్, కేవీకే రంగారావు, వల్లూరి రవి, పడాల సుబ్బారెడ్డి, ఆకుల గౌతమ్, వీటీ విల్సన్ రాజు, కొండపల్లి రత్నసాయి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఉండ్రాజవరం: స్థానిక మెయిన్ రోడ్డులోని ఉన్నత పాఠశాల వద్ద ఆదివారం ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొన్న ఘటనలో ఒక వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, నిడదవోలు మండలం మునిపల్లికి చెందిన భావన రాము (55) వేలివెన్ను గ్రామంలోని ఓ స్కూల్ బస్ డ్రైవర్. తణుకు నుంచి తన స్వగ్రామం మునిపల్లి బైక్‌పై వెళుతున్నాడు. ఘటనా స్థలం వద్దకు వచ్చేసరికి తణుకు వైపునకు వస్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన రామును స్థానికులు తణుకు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అతడు మృతి చెందాడు. దీనిపై అతడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉండ్రాజవరం ఎస్సై కె.రామారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

కొవ్వూరు: మండలంలోని వేములూరుకు మేడిద వంశీ, కొవ్వాడి పవన్ అనే ఇద్దరిపై కొవ్వూరు పట్టణ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. వారిద్దరూ గత నెల 30న మద్యం సేవించి తన ఇంటికి వచ్చి దాడి చేసినట్టు వేములూరుకే చెందిన కావూరి నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్సై బి.దుర్గాప్రసాద్ తెలిపారు.

పథకాలతో ప్రతి కుటుంబానికీ లబ్ధి

- హోం మంత్రి తానేటి వనిత
- వేములూరులో గడప గడపకూ..



ఓ ఇంటి వద్ద మహిళలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న మంత్రి తానేటి వనిత

కొవ్వూరు: వివిధ సంక్షేమ పథకాల ద్వారా రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికీ ఆర్థిక లబ్ధి చేకూర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. మండలంలోని వేములూరు గ్రామంలో ఆదివారం ఆమె గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పలువురు ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలసి మంత్రి వనిత గ్రామంలోని ఇంటింటికీ వెళ్లారు. ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించాలని కోరారు. గత నాలుగున్నర ఏళ్ల పాలనలో సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూర్చిన లబ్ధిని మంత్రి వనిత వివరించారు. కార్యక్రమంలో వేములూరు సర్పంచ్ ఆరేపల్లి శ్రీనివాస్, శ్రీ రామా సొసైటీ మాజీ అధ్యక్షుడు కొటికలపూడి అబ్రహం, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఎలికె చిన వీర్రాజు, వైఎస్సార్ సీపీ మండల యూత్ అధ్యక్షుడు వారా రత్నరాజీవ్, జెడ్పీ వైస్ చైర్ పర్సన్ పోసిన శ్రీలేఖ, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభశెట్టి గంగాధర శ్రీనివాస్, నాయకులు వేములపల్లి గోపి, చిట్టూరి అన్నవరం తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ల్యాబ్ టెక్నీషియన్‌గా దుర్గాప్రసాద్



జిల్లా స్థాయి ఉత్తమ ల్యాబ్ టెక్నీషియన్‌గా భీమవరంలో అవార్డు అందుకుంటున్న దుర్గా ప్రసాద్

కొవ్వూరు: స్థానిక ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి (సీహెచ్‌సీ) లోని ఐసీటీసీ విభాగంలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న వాజా దుర్గా ప్రసాద్‌కు 2022–23 సంవత్సరానికి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా స్థాయిలో బెస్ట్ ల్యాబ్ టెక్నీషియన్ అవార్డు లభించిందని ఆసుపత్రి సూపరింటెండెంట్ సాయికిరణ్ తెలిపారు. భీమవరంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో డీఎంహెచ్‌వో ఉమా మహేశ్వరరావు చేతులమీదుగా దుర్గాప్రసాద్ ఈ అవార్డు అందుకున్నారన్నారు. కొవ్వూరు ఆసుపత్రి ఐసీటీసీ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు దుర్గాప్రసాద్‌కు 2012–13 లోను, 2013–14లో కూడా జిల్లాస్థాయి అవార్డులు లభించాయని చెప్పారు. ఇప్పుడు మూడోసారి ఉత్తమ అవార్డు సొంతం చేసుకోవడం అభినందనీయం అన్నారు.దుర్గా ప్రసాద్‌ను ఆసుపత్రి వైద్యులు సుభాషిణి, రజనీకాంత్, ఐసీటీసీ కౌన్సిలర్ ఎస్. సత్యనారాయణ అభినందించారు.

ఓటర్ల నమోదు ప్రక్రియకు 1,945 దరఖాస్తులు



వేములూరు శిబిరంలో ఓటర్ల నమోదుపై ఆరా తీస్తున్న తహసీల్దార్ నాగరాజు నాయక్

కొవ్వూరు: రెండు రోజుల పాటు నిర్వహించిన ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియకు కొవ్వూరు నియోజకవర్గంలో 1,945 దరఖాస్తులు అందాయని తహసీల్దార్ బి.నాగరాజు నాయక్ తెలిపారు. కొవ్వూరు పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో జరుగుతున్న ఓటర్ల సవరణ, నమోదు ప్రక్రియను ఆదివారం ఆయన పరిశీలించారు. కొత్త ఓటర్ల నమోదుకు 1,246, మరణించిన వారి పేర్ల తొలగింపు, వేరొక నియోజకవర్గానికి, రాష్ట్రానికి బదిలీ అయిన వారి ఓట్ల తొలగింపు కోసం 151 దరఖాస్తులు అందాయన్నారు. అలాగే ఓటరు జాబితాలో అక్షర దోషాలు, డోర్ నంబర్ మార్పు, వేరొక పోలింగ్ కేంద్రానికి పేరు మార్పు వంటి అంశాల కోసం 548 దరఖాస్తులు అందాయని తహసీల్దార్ వివరివంచారు. కొవ్వూరు మండలం, పురపాలక సంఘం పరిధిలో అత్యధికంగా 808 దరఖాస్తులు అందాయన్నారు. చాగల్లు మండలంలో 712, తాళ్లపూడి మండలంలో 425 దరఖాస్తులు అందినట్టు తెలిపారు.

ఉండ్రాజవరం మండలంలో కొత్త ఓట్ల కోసం 293

ఉండ్రాజవరం: మండల వ్యాప్తంగా ప్రత్యేక శిబిరాలు నిర్వహించగా కొత్తగా ఓటరు నమోదు కోసం 293 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ జి.కనకరాజు తెలిపారు. మండలంలోని 58 పోలింగ్ బూత్‌ల వద్ద శని, ఆదివారాల్లో ఓటు నమోదు, సవరణ ప్రత్యేక శిబిరాలు నిర్వహించినట్టు ఆయన చెప్పారు. కొత్తగా ఓటు హక్కు కోసం (ఫారం 6) 293 దరఖాస్తులు రాగా, తొలగింపునకు (ఫారం 7) 44, చేర్పులు, మార్పులు, తప్పులను సరిదిద్దడానికి (ఫారం 8) 193 దరఖాస్తులు వచ్చాయని వివరించారు.

దేవరపల్లి మండలంలో 558

దేవరపల్లి: ఓటరు నమోదు కోసం మండలంలో రెండు రోజుల పాటు నిర్వహించిన శిబిరాల్లో కొత్తగా ఓటు హక్కు కోసం 558 దరఖాస్తులు వచ్చినట్టు తహసీల్దార్ ఎం.రామకృష్ణ తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లోని ఓటు నమోదు కేంద్రాలను ఆదివారం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఈఆర్‌ఓ ఎం.వెంకట సుధాకర్ పరిశీలించారు. కొత్తగా ఓటు హక్కు కోసం వచ్చిన దరఖాస్తులను ఆయన పరిశీలించారు. ఓటు తొలగింపు కోసం 54, మార్పులు, సవరణకు 89 దరఖాస్తులు వచ్చినట్టు తహసీల్దార్ వివరించారు.

నిడదవోలు నియోజవర్గంలో 1151

నిడదవోలు: పట్టణంలోని ఓటరు నమోదు కేంద్రాలను నిడదవోలు ఈఆర్‌ఓ ఎం.ఝాన్సీరాణి, తహసీల్దార్ ఎం.గంగరాజు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఝాన్సీరాణి మాట్లాడుతూ నిడదవోలు నియోజకవర్గంలో కొత్తగా ఓటు హక్కు కోసం 1151 దరఖాస్తులు, ఓట్ల తొలగింపు కోసం 223, చేర్పులు, మార్పులు, తప్పులు సరిదిద్దడానికి 589 దరఖాస్తులు వచ్చినట్టు వివరించారు.

నిరుపేదలకు బియ్యం అందజేత

చాగల్లు: మల్లిపూడి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నిరుపేదలను సహాయం అందించడం అభినందనీయమని వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు చెల్లింకుల దుర్గా మల్లేశ్వరరావు అన్నారు. ఈ ట్రస్ట్ ఆధ్వర్యంలో చాగల్లులోని 50 నిరుపేద కుటుంబాలకు 15 కేజీల చొప్పున నాణ్యమైన బియ్యాన్ని ఆదివారం ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధి మల్లిపూడి ధనరాజు, గెడ్డం సురేష్, బోలిపో రమేష్, గెల్లా ఆనంద్, మట్టా సుబ్బారావు, అయినం సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వరరావు, జీవరత్నం తదితరులు పాల్గొన్నారు

'సెయింట్ ఆంబ్రోస్'లో దివ్యాంగుల దినోత్సవం



నిడదవోలులో కేక్ కట్ చేసి దివ్యాంగులకు శుభాకాంక్షలు చెబుతున్న ఎస్సై నాగరాజు

నిడదవోలు: అంగ వైకల్యం శరీరానికే కాని, మనస్సుకు కాదని, విభిన్న ప్రతిభావంతులు మనోధైర్యంతో తమ కాళ్ల మీద నిలబడి నలుగురినీ పోషించే స్థాయికి ఎదగాలని పట్టణ ఎస్సై పి.నాగరాజు అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని ఆదివారం స్థానిక సెయింట్ ఆంబ్రోస్ హైస్కూల్ ఆవరణలో నిర్వహించారు. పట్టణానికి చెందిన జ్యోతిర్మయి దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకకు ఎస్సై నాగరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన కేక్ కట్ చేసి దివ్యాంగులకు మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పట్టణ జ్యోతిర్మయి దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ర్యాలి సత్యనారాయణ, వంగా కృపానందం, విశ్వాస్ వర్మ, మునుకూడి బాలాజీ, సునీత, కుప్పాల రాంబాబు, టి.సత్తిబాబు తదిరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు సత్కారం

నల్లజర్ల: దివ్యాంగుల దినోత్సవాన్ని ఆదివారం మండలంలోని ప్రకాశరావుపాలెం గ్రామంలో నిర్వహించారు. వికసిత్ భారత్ సంకల్పయాత్రలో భాగంగా పలువురు వికలాంగులను బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టిపల్లి శివనాగరాజు ఆధ్వర్యంలో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల జీవితాలలో వెలుగులు నింపిన ఘనత ప్రధాని మోదీకే దక్కుతుందన్నారు. రోగులకు విశేష సేవలు అందిస్తున్న నల్లజర్ల పీహెచ్‌సీ డాక్టరు తెల్లం గంగాధరరావును శివనాగరాజు శాలువా కప్పి సత్కరించారు.కార్యక్రమంలో బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు చెల్లు సత్యనారాయణ, అయ్యంకి రామకృష్ణ, వైద్య ఉద్యోగుల సంఘ నాయకులు జీవీవీ ప్రసాద్, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఊనగట్లలో 'వై ఏపీ నీడ్స్ జగన్'

చాగల్లు: వైఎస్సార్ సీపీ నాయకులు ఆదివారం మండలంలోని ఊనగట్ల సచివాలయ పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. వారు ఇంటింటికీ వెళ్లి జగన్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. వై ఏపీ నీడ్స్ బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకుల ఇళ్ల వద్ద పార్టీ జెండాను ఎగురవేసి పల్లె నిద్ర చేశారు. కార్యక్రమంలో పార్టీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆత్కూరి దొరయ్య, మండల శాఖ అధ్యక్షుడు చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, సర్పంచ్ మట్టా వెంకట్రావు, ఎంపీటీసీ సభ్యుడు ఆత్కూరి గోపీచంద్, స్థానిక నేతలు కంకటాల శ్రీనివాస్, మెరిపో సూర్యచంద్రం, నాగరాజు పాల్గొన్నారు.

తీపర్రులో షిర్డీ సాయి ఆలయ వార్షికోత్సవం



గణపతి హోమం నిర్వహిస్తున్న పండితులు

పెరవలి: తీపర్రు గ్రామంలోని షిర్డీ సాయిబాబా ఆలయ 20వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి పంచామృతాలతో అభిషేకం, తులసి పూజ జరిగాయి. అనంతరం దాత వీరమళ్ల సతీష్, స్రవంతి దంపతులచే గణపతి హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుందర హనుమాన్ సంఘం ఆధ్వర్యంలో బాలలు ప్రదర్శించిన కోలాటం ఆకట్టుకుంది. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన అన్న సమారాధనకు తీపర్రు, ఉసులుమర్రు, కాకరపర్రు, తాడిపర్రు, వెలగదురు తదితర గ్రామాల నుంచి సుమారు 12 వేల మంది భక్తులు హాజరై బాబా ప్రసాదాన్ని స్వీకరించారు. మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, మాజీ మంత్రి పీతాని సత్యనారాయణ కూడా హాజర్రై బాబా ఆశీస్సులు పొందారు.

తెలంగాణలో విజయంతో కాంగ్రెస్ సంబరాలు

దేవరపల్లి/ గోపాలపురం: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంతో ఆదివారం సాయంత్రం మండలంలోని దుద్దుకూరులో మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు వెలగా రామకృష్ణ ఆధ్వర్యంలో విజయోత్సవ వేడుకలు నిర్వహించారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద రామకృష్ణ కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు కాకర్ల హరిబాబు, డీసీసీ కార్యదర్శి చాపల వెంకటేశ్వరరావు, మండల నాయకులు పాల్గొన్నారు. అలాగే గోపాలపురంలో కాంగ్రెస్ మండల నాయకులు మాజీ ప్రధాని ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. చెక్ పోస్టు సెంటర్ వద్ద మిఠాయిలు పంపిణీ చేశారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు మట్టపర్తి రామమోహన్‌రావు, గన్నిన రామారాయుడు, నాయకులు పాల్గొన్నారు.

కొవ్వూరులో బంగారు గొలుసు చోరీ

కొవ్వూరు: పట్టణానికి చెందిన పాతూరి భాగ్యలక్ష్మి అనే మహిళ ఇంట్లో 16 గ్రాముల బంగారు గొలుసు చోరీకి గురైంది. గత నెల 17న కుటుంబ సభ్యులతో కలిసి ఆమె బయటకు వెళ్లింది. ఆ సమయంలో ఇంట్లో సొరుగులో భద్రపరిచిన గొలుసు చోరీకి గురైంది. సునీత అనే పని మనిషిపై అనుమానం ఉన్నట్టు,సీసీ కెమెరాలను పరిశీలిస్తే ఆమె చోరీకి పాల్పడినట్లు తెలిసిందని ఆదివారం ఫిర్యాదు చేసినట్టు పట్టణ ఎస్సై బి.దుర్గాప్రసాద్ తెలిపారు.

కాపులకు వైఎస్సార్ సీపీలోనే సముచిత స్థానం

- వన సమారాధనలో ఎమ్మెల్యేలు తలారి, పుప్పాల



ఎమ్మెల్యే తలారి వెంకట్రావును సత్కరిస్తున్న కాపు నేతలు

ద్వారకాతిరుమల: కాపులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే సముచిత స్థానం లభిస్తోందని గోపాలపురం, ఉంగుటూరు ఎమ్మెల్యేలు తలారి వెంకట్రావు, పుప్పాల వాసుబాబు అన్నారు. స్థానిక కాపు కల్యాణ మండపంలో ఆదివారం జరిగిన కాపు కార్తిక వన సమారాధనలో వారు ముఖ్య అతిథులుగా వేర్వేరుగా పాల్గొన్నారు. ముందుగా ఎమ్మెల్యే తలారి కల్యాణ మండప ఆవరణలోని ఉసిరి చెట్టు వద్ద దామోదర పూజ చేశారు. అనంతరం కల్యాణ మండపంలో కాపులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలారిని కాపు సంఘ నేతలు దుశ్శాలువాతో సత్కరించి, జ్ఞాపిక అందజేశారు. ఆ తర్వాత కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వాసుబాబు ముందుగా దామోదర పూజ నిర్వహించి, వనసమారాధనను ప్రారంభించారు. వాసుబాబును కూడా కాపు నేతలు సత్కరించారు. కార్యక్రమంలో కాపునాడు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు చిన్నమిల్లి వెంకట్రాయుడు, జిల్లా కార్యదర్శి మాకా శ్రీనివాసరావు, శ్రీవారి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యురాలు పెద్దిరెడ్డి వెంకటకొండ పద్మ, జ్యోతి శ్రీనివాస్, కాపునాడు మండలశాఖ అధ్యక్షుడు పుప్పాల మురళి తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరంలో బ్రాహ్మణులు..

ఉండ్రాజవరం: బ్రాహ్మణ సేవాసమితి ఆధ్వర్యంలో ఉండ్రాజవరంలో ఆదివారం కార్తిక వన సమారాధన జరిగింది. ఈ.సత్యకృష్ణ దంపతులు ఈ సందర్భంగా సహస్ర నామాలతో లక్ష్మీ నారాయణ పూజ, కార్తిక దామోదర పూజ నిర్వహించారు. అనంతరం పిల్లలకు ఆటలు, మహిళలకు హౌసీ, మ్యూజికల్ చైర్స్ వంటి పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మండల బ్రాహ్మణ సేవా సమితి అధ్యక్షుడు దోనేపూడి సుధాకర్, ఉపాధ్యక్షుడు ఆకెళ్ల శ్రీనివాసరావు, దోనేపూడి శ్రీరామ్‌పవన్, రాపర్తి వెంకట్రామయ్య, కూచిభొట్ల గోపాలకృష్ణమూర్తి, కె.సత్యనారాయణ, జె.శివరామకృష్ణ, వై.భాస్కరరావు పాల్గొన్నారు.

కొవ్వూరులో నాయీ బ్రాహ్మణులు..

కొవ్వూరు: నాయీ బ్రాహ్మణ వృత్తి, ఉద్యోగ, వ్యాపారస్తుల కార్తిక వన సమారాధన ఆదివారం పట్టణంలోని వేములూరులో రోడ్డులో ఉన్న దుద్దుపూడి గార్డెన్స్‌లో జరిగింది. ముఖ్య అతిథులుగా తుమ్మిడి రామ్‌కుమార్, మునిసిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, బెన్నీ దంపతులు హాజరయ్యారు. ముందుగా నాయి బ్రాహ్మణ సంఘ పెద్దలు ఉసిరి చెట్టు వద్ద కార్తిక దామోదరుడికి పూజలు చేశారు. కుటుంబ సమేతంగా నాయీ బ్రాహ్మణులంతా సహపంక్తి భోజనాలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.ధన్వంతరి నాయి బ్రాహ్మణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు సుందరపల్లి గోపాలకృష్ణ, జిల్లా అధ్యక్షుడు మేడూరి వీర్రాజు, నాయిబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పట్నాల గౌరీ గణపతి తదితరులు పాల్గొన్నారు.













